'జైభీమ్'కు అసెంబ్లీలో ప్రశంసలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సమాజంలో అణగారిన తరగతులపై జరుగుతున్న దాడులకు దర్పణం పడుతూ తెరకెక్కిన 'జైభీమ్' చిత్రానికి రాష్ట్ర శాసనసభలో ప్రశంసలు లభించాయి. ఇలాంటి సామాజిక ఇతివృత్తమున్న చిత్రాలు మరిన్ని రావాల్సిన అవసరముందని ప్రభుత్వ ఛీఫ్ విప్ గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. సాంఘిక సంక్షేమశాఖపై బుధవారం చర్చ జరిగింది. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ 'జైభీమ్' సినిమాను కుటుంబ సభ్యులతో కలిసి చూశామని, సామాజిక ఇతివృత్తంతో ఎంతో చక్కగా తీశారని కొనియాడారు. ఆంధ్రప్రదేశ్‌లోనూ 'జైభీమ్' లాంటి చిత్రాలు తీయాల్సిన అవసరం ఉందని, నటులందరూ ఈ కోణంలో ఆలోచించాలన్నారు.

భూటాన్‌లా..

ఆంధ్రప్రదేశ్‌ను భూటాన్‌తో పోల్చవచ్చని సింగనమల ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి అన్నారు. సామాజిక న్యాయంపై చర్చలో ఆమె మాట్లాడుతూ దళితులకు ఇళ్లను నిర్మించి గౌరవంగా బతికేలా చూస్తున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అడగకముందే అన్నీ ఇచ్చేస్తున్నారని అన్నారు. ఈ విషయంలో భూటాన్‌తో ఎపిని పోల్చవచ్చునని ఆమె చెప్పారు. అక్కడ ఇళ్లు లేనివారు రాజుకు మొరపెట్టుకుంటే వెంటనే రాజే పూర్తి ఖర్చులతో ఇళ్లు నిర్మించి ఇస్తారని, ఇక్కడ అదే పరిస్థితి ఉందన్నారు. ఇళ్లు లేనివారు సెక్రటేరియట్లో దరఖాస్తు చేసుకుంటే వెంటనే ఇల్లు ఇస్తున్నారని తెలిపారు.

కీలక బిల్లులకు అసెంబ్లీ ఆమోదం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

శాసనసభ బుధవారం పలు కీలక బిల్లులకు ఆమోదం తెలిపింది. ఎపి మోటారు వాహనాల పన్ను (సవరణ) బిల్లు-2021, ఎపి సినిమాస్ (నియంత్రణ) సవరణ బిల్లు-2021 బిల్లులను బుధవారం అసెంబ్లీ ఆమోదించింది. ఈ రెండు బిల్లులను ముఖ్యమంత్రి తరపున రాష్ట్ర సమాచారశాఖ మంత్రి పేర్ని నాని సభలో ప్రవేశపెట్టారు. వీటితో పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యాసంస్థల (టీచర్స్ కేడర్‌లో రిజర్వేషన్లు) బిల్లు -2021, ఎపి విశ్వ విద్యాలయాల సవరణ బిల్లు -2021, జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలాజికల్ యూనివర్శిటీస్ (సవరణ) బిల్లు-2021ని కూడా ప్రవేశపెట్టారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ భూమి (వ్యవసాయేతర ప్రయోజనాల కోసం మార్పిడి) సవరణ బిల్లు-2021ని డిప్యూటీ సిఎం ధర్మాన కృష్ణదాస్ సభలో ప్రవేశపెట్టారు. బిల్లులన్నింటిని అసెంబ్లీ ఆమోదం తెలిపిందని స్పీకర్ తమ్మినేని సీతారాం ప్రకటించారు.

స్మార్ట్ పోలీసింగ్‌లో రాష్ట్ర పోలీస్ శాఖ జాతీయస్థాయిలో అగ్రగామిగా నిలిచిన నేపథ్యంలో డిజిపి గౌతం సవాంగ్ బుధవారం ముఖ్యమంత్రి జగన్‌ను కలిశారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ జాతీయస్థాయిలో ఘనత సాధించినందుకు అభినందనలు తెలిపారు. ఇక ముందు కూడా ప్రజలకు ఇదేరీతిలో సేవలందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు డిజిలు రవిశంకర్ అయ్యన్నార్, శంకబ్రతబాగ్చి, డివిజి పాలరాజు కూడా పాల్గొన్నారు.

ఇది చారిత్రక దినం : స్పీకర్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఒక రోజంతా బిసి, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల సంక్షేమం గురించి అసెంబ్లీలో చర్చ జరిగిన బుధవారం చారిత్రక దినమని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం వ్యాఖ్యానించారు. బుధవారం సంక్షేమంపై చర్చ ముగిసిన అనంతరం స్పీకర్ మాట్లాడుతూ మంత్రులందరూ జిల్లాల్లో పర్యటిస్తున్న సమయంలో, ఎమ్మెల్యేలు మండలాల్లో పర్యటిస్తున్న సమయంలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజల్లో అవగాహన కలిగించాలన్నారు.

గిరిజన స్వాతంత్ర్య సమరయోధుల కోసం మ్యూజియం : పుష్పశ్రీవాణి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గిరిజన స్వాతంత్ర సమర యోధుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఒక మ్యూజియాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు డిప్యూటీ సిఎం పుష్పశ్రీవాణి తెలిపారు. గిరిజన సంక్షేమంపై బుధవారం జరిగిన చర్చలో ఆమె మాట్లాడుతూ చింతపల్లి మండలం తాజాంగిలో ఏర్పాటు చేస్తున్న ఈ మ్యూజియాన్ని 2023 మార్చిలోగా పూర్తి చేయనున్నట్లు చెప్పారు. మ్యూజియం నిర్మాణంలో కేంద్ర ప్రభుత్వం వాటాగా రూ.15కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం రూ.20కోట్లు నిధులు కేటాయించిందన్నారు. గిరిజన ప్రాంతాల్లో ఐదు మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల నిర్మాణానికి ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసిందన్నారు. గిరిజనులు సాగుచేసుకుంటున్న అటవీ భూములకు ఆర్ఓఎఫ్ పట్టాలు ఇవ్వడం జరిగిందని, ఫలితంగా రైతు భరోసా అందుతోందన్నారు. జగనన్న విద్యాదీవెన, జగనన్న వసతి దీవెన, జగనన్న విద్యాకానుక, అమ్మవడి, వైఎస్ఆర్ పెన్షన్‌కానుక, జగనన్న గోరుముద, వైఎస్ఆర్ ఆసరా, వైఎస్ఆర్ చేయూత లాంటి పథకాల ద్వారా గిరిజనులకు ఎంతో లబ్ధి చేకూరిందన్నారు. జగ్జీవన్‌జ్యోతి పథకం కింద గిరిజన కుటుంబాలకు 100 యూనిట్ల నుంచి 200 యూనిట్లకు పెంచి ఉచిత విద్యుత్తును అందిస్తోందన్నారు. గిరిజన ప్రాంతాల్లోని వాలంటీర్ల పాత్ర ఎంతో కీలకమన్నారు. గిరిజన ప్రాంత సమస్యలపై సిఎం జగన్‌మోహనహరెడ్డికి మంచి అవగాహన ఉందని, దీంతో తమ సమస్యలు సులభంగా పరిష్కారమవుతున్నాయన్నారు. ఈ సందర్భంగా సిఎంను గిరిజన పక్షపాతిగా ఆమె అభివర్ణించారు. ఎమ్మెల్యే రాజన్న దొర మాట్లాడుతూ కొమరంభీమ్, అల్లూరి సీతారామరాజు లాంటి పోరాట యోధుల త్యాగ ఫలాలు నేడు గిరిజనులకు ఫలాలను అందిస్తున్నాయన్నారు. కొరియా గ్రామాల సమస్య గురించి ఇటీవల సిఎం, ఒరిస్సా సిఎంతో మాట్లాడిన తర్వాత ఒరిస్సా అధికారుల నుంచి వేధింపులు, ఇబ్బందులు నిలిచి పోయాయన్నారు. ఎమ్మెల్యేలు బాలరాజు, కళావతి మాట్లాడుతూ 500 జనాభా ఉన్న గిరిజన గ్రామాలను ప్రత్యేకంగా పంచాయతీలు చేస్తే బాగుంటుందన్నారు. పోలవరం నిర్వాసితులకు పునరావాస ప్యాకేజీ పెంచినందుకు సిఎంకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు.

కేంద్రం సూచనల మేరకే గ్రీన్ ట్యాక్స్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం పర్యావరణ హితం కోసం కేంద్రం ఆదేశాల మేరకే గ్రీన్ ట్యాక్స్ పెంచుతున్నట్లు రాష్ట్ర సమాచార, రవాణాశాఖ మంత్రి పేర్ని నాని తెలిపారు. బుధవారం నాడు ఆయన సచివాలయంలో మీడియాతో మాట్లాడారు. ఆటోలకు, టూ వీలర్స్‌కి గ్రీన్స్ ట్యాక్స్ పెంపుదల ఉండదన్నారు.

మద్యం ఆదాయంతో సంక్షేమమా?

అమ్మఒడికి లింక్‌పెట్టడం సరికాదు • మండలిలో పిడిఎఫ్ ఎమ్మెల్సీలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అమ్మఒడి, చేయూత, ఆసరా వంటి సంక్షేమ పథకాలను మద్యంనుండి వచ్చే ఆదాయంతో అమలుచేస్తామంటూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన చట్టసవరణపై పిడిఎఫ్ ఎమ్మెల్సీలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. బడిలో చదువుకునే విద్యార్థికి తాను తాగుబోతులు తాగడం వల్ల వచ్చే ఆదాయంతో చదువుకుంటున్నానే మెస్సేజ్ పోతే ఎలా అంటూ పిడిఎఫ్ ఫ్లోర్‌లీడర్ వీరపు బాలసుబ్రమణ్యం ప్రశ్నించారు. బుధవారంనాడు శాసన మండలిలో దేశంలో తయారైన విదేశీ మద్యం వ్యాపార చట్టం సవరణ బిల్లును రాష్ట్ర ఆర్థికశాఖమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ తమ ప్రభుత్వం కొత్తగా చట్టం తీసుకురావడంలేదని, కేవలం గతంలో వున్న చట్టానికి సవరణలను చేస్తున్నామని తెలిపారు. అమ్మఒడి, చేయూత, ఆసరా పథకాలను మద్యం అమ్మకాల ద్వారా వచ్చే ఆదాయంతో అమలు చేస్తామని తెలిపారు. ఇందుకు పిడిఎఫ్ ఫ్లోర్ లీడర్ వీరపు బాలసుబ్రమణ్యం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇది సరైన నిర్ణయం కాదన్నారు. ఇటీవల కాలంలో ప్రభుత్వానికి తొందరపాటుతో చట్టాలు చేయడం తర్వాత సరిదిద్దు కోవడం సర్వసాధారణం అయ్యిందన్నారు. ఈ చట్టం కూడా ప్రభుత్వం పరువుపోగొట్టుకునే అంశమని అన్నారు. పారిశ్రామిక సంస్థలనుండి సామాజిక బాధ్యత ప్రోగ్రామ్ కింద వన్నును వసూలు చేస్తున్నట్లు తాగుబోతులకు అమ్మఒడి బాధ్యతను అప్పగించడం ప్రభుత్వం బాధ్యతా రాహిత్యం అవుతుందని పిడిఎఫ్ ఎమ్మెల్సీ ఐ వెంకటేశ్వరరావు అన్నారు. మద్యపాననిషేదాన్ని దశలవారీగా ఎత్తివేస్తామని హామి ఇచ్చి ఇపుడు తాగుబోతులకు ఎక్కువ తాగండి అనే బాధ్యతను ప్రభుత్వం ఇచ్చినట్లుగా వుందని ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి అన్నారు. బిజెపి ఎమ్మెల్సీ మాదవ్ మాట్లాడుతూ సంక్షేమం కోసం మద్యం ఆదాయం అనే మాట వినేందుకు కూడా హాస్యాస్పదంగా వుందని అన్నారు. ప్రభుత్వం మద్యం విధానాన్ని సమీక్షించుకోవాలని అన్నారు.

డిఎడ్ 2018 ప్రైవేట్ వారికి పరీక్షలు : లక్ష్మణరావు

డిఎడ్ 2018-20 విద్యాసంవత్సరం ప్రైవేట్ విద్యార్థులకు పరీక్షలు నిర్వహించాలని పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు శాసన మండలిలో డిమాండ్ చేశారు. మండలి చైర్మన్ మోషేను రాజు ద్వారా ప్రత్యేక ప్రస్తావనతో ప్రభుత్వం దృష్టికి బుధవారం ఈ అంశాన్ని తీసుకెళ్లారు. 2018-20 ప్రభుత్వ విద్యార్థులకు జరిగాయని, ప్రైవేట్ వారికి జరగలేదన్నారు. ప్రభుత్వం అనుమతి తీసుకోకుండా ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు అడ్మిషన్లు చేసుకున్నాయని వివరించారు. యాజమాన్యాలు చేసిన తప్పుకు విద్యార్థులను బలి చేయడం సరికాదని వెంటనే పరీక్షలు నిర్వహించాలని కోరారు. పాలిటెక్నిక్ కళాశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు లెక్చరర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఎమ్మెల్సీ ఐ వెంకటేశ్వరరావు మరో ప్రత్యేక ప్రస్తావన తీసుకొచ్చారు. ఇరుకైన భవనాల్లో డిగ్రీ కళాశాలలు తరగతులు నిర్వహిస్తున్నాయని, వీటిపై చర్యలు తీసుకోవాలని వై శ్రీనివాసులు రెడ్డి మరో ప్రస్తావన తీసుకొచ్చారు.

బాధితులకు పూర్తి సాయం

సమీక్షలో సిఎం ఆదేశం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వరద ప్రభావిత ప్రాంతాల్లో బాధిత ప్రజానీకానికి పూర్తిస్థాయిలో సాయం అందించాలని, ఎక్కడా ఫిర్యాదులు రావడానికి వీలులేదని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. క్యాంపు కార్యాలయం నుండి సంబంధిత జిల్లాల కలెక్టర్లతో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దాదాపు 95 వేల కుటుంబాలు వరదల వల్ల బాధలకు గురయ్యాయని చెప్పారు. వారికి సాయం అందడంలో లోపం జరగకూడదన్నారు. తాగునీటి సరఫరా విషయమై ప్రత్యేకంగా దృష్టి సారించాలనిచెప్పారు. పశువులకు వ్యాక్సినేషన్ చేయడంతో పాటు, దాణా పంపిణీ పూర్తి చేయాలన్నారు. అదేవిధంగా చనిపోయిన వాటికి పరిహారం అందించాలన్నారు. పూర్తిగా, పాక్షికంగా దెబ్బతిన్న ఇళ్లకు పరిహారాన్ని వెంటనే అందించాలని అధికారులను ఆదేశించారు అన్నమయ్య ప్రాజెక్టును 2.85 లక్షల క్యూసెక్కులు విడుదల చేసేలా డిజైన్ చేయాల్సిఉండగా, 2.17 లక్షల క్యూసెక్కుల నీటి విడుదలకే డిజైన్ చేశారని తెలిపారు. ఫలితంగా ప్రస్తుతం తెగిందన్నారు. ఇప్పుడు విమర్శలు చేస్తున్న నాయకులు అప్పుడు పట్టించుకోలేదని అన్నారు. ఫించా విడుదల సామర్థ్యం 58 వేల క్యూసెక్కులయితే 1.38 లక్షల క్యూసెక్కుల వరద వచ్చిందన్నారు. వచ్చిందని అన్నారు. చెయ్యేరు వెంట కూడా ఇదే పరిస్థితి వచ్చిందని తెలిపారు. 13 జిల్లాల్లో ఉన్న ఇరిగేషన్ ప్రాజెక్టులు, డ్యాంల భద్రతపై దృష్టి పెట్టాలని, గత ప్రభుత్వాల్లో ఇచ్చిన నివేదికలు బయటపెట్టాలని సిఎం తెలిపారు. 26 నుండి వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో అందరూ అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఈ సమావేశంలో సిఎస్ సమీర్‌శర్మ, డిజిపి గౌతం సవాంగ్, ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు పూనం మాలకొండయ్య, అజయ్‌జైన్, ముఖ్య కార్యదర్శులు అనిల్‌కుమార్ సింఘాల్, వి.ఉషారాణి పాల్గొన్నారు.

కొడాలి నానికి భద్రత పెంపు

ముగ్గురు ఎమ్మెల్యేలకు కూడా

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఇటీవల చోటు చేసుకున్న పరిణామాల నేపథ్యంలో పౌరసరఫరాలశాఖ మంత్రి కొడాలి శ్రీ వెంకటేశ్వరరావు (నాని), ఎమ్మెల్యేలు డాక్టర్ వల్లభనేని వంశీ మోహన్, ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి, అంబటి రాంబాబుకు అపాయం ఉందన్న సమాచారంతో భద్రతను పెంచినట్లు ప్రభుత్వం తెలిపింది. ఈ మేరకు ఇంటెలిజెన్స్ అదనపు డిజిపి కెవి రాజేంద్రనాథ్‌రెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. మంత్రి కొడాలి నానికి ప్రస్తుతం వై కేటగిరి భద్రతతోపాటు అదనంగా ఒక వ్యక్తిగత భద్రతాధికారి (పిఎస్ఓ), ఎస్కార్ట్ (ఇద్దరు ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్ పిఎస్ఓలు, జిల్లా నుంచి ఇద్దరు పిఎస్ఓలు, 1+4 ఎఆర్ గార్డులు, కాన్వాయ్‌లో 1+3 ఎస్కార్ట్‌తో కలసి మొత్తం 13 మంది భద్రతా సిబ్బంది ఉన్నారు. తాజాగా ఈ సంఖ్యను 17కు పెంచారు. వై కేటగిరితోపాటు ఎస్కార్ట్‌లో ఐఎస్‌డబ్ల్యు నుంచి ఇద్దరు పిఎస్ఓలతోపాటు జిల్లా నుంచి ఆరుగురు పిఎస్ఓలు, 1+4 ఆర్మ్‌డ్ గార్డు, కాన్వాయ్‌లో 1+3 ఎస్కార్ట్ ఉంటుంది. అలాగే కృష్ణాజిల్లా గన్నవరం ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీ మోహన్, తూర్పు గోదావరి జిల్లా కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి, గుంటూరు జిల్లా సత్తెనపల్లి ఎమ్మెల్యే అంబటి రాంబాబుకు ప్రస్తుతం 1+1 భద్రత ఉండగా, 3+3 భద్రతను అదనంగా కల్పించారు. దీంతో ముగ్గురు ఎమ్మెల్యేలకు బుధవారం నుంచి 4+4 భద్రతను కల్పించారు.

ప్రైవేట్ విశ్వవిద్యాలయాల్లో 35శాతం కన్వీనర్ కోటా

బిల్లుకు ఆమోదం తెలిపిన మండలి

రాష్ట్రంలోని ప్రైవేట్ యూనివర్సిటీల్లో కన్వీనర్ కోటా కింద 35శాతం సీట్లు కల్పిస్తూ ప్రభుత్వం తీసుకొచ్చిన ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ విశ్వ విద్యాలయముల(స్థాపన మరియు క్రమబద్ధీకరణ)సవరణ -2021బిల్లుకు శాసన మండలి ఆమోదం తెలిపింది. అదేవిధంగా వీటి పర్యవేక్షణ ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్య నియంత్రణ, పర్యవేక్షణ కమిషన్ చట్టం-2021 బిల్లుకు కూడా ఆమోదం తెలిపింది.

అమరావతిలో ప్లాట్లపై నీలినీడలు

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

మూడు రాజధానుల ప్రతిపాదనల ఉపసంహరణ నేపథ్యంలో రాజధాని అమరావతిలో భూములు ఇచ్చిన రైతులకు అభివృద్ధి చేసిన ప్లాట్లు ఎప్పటికి అప్పగిస్తారన్నది రాజధాని గ్రామాల్లో ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. రాజధాని అమరావతి ప్రాంతంలో 29 గ్రామాల్లో దాదాపు 22,736 మంది రైతుల నుంచి 34,750 ఎకరాల భూములను సమీకరించాలని అప్పటి టిడిపి ప్రభుత్వం నిర్ణయించింది. దీనిపై కొందరు కోర్టును ఆశ్రయించారు. 2,500 ఎకరాల భూములను సమీకరణకు ఇవ్వలేదు. 32,250 ఎకరాలను ప్రభుత్వం సమీకరించింది. 2019 డిసెంబరు 23న అసెంబ్లీలో ఆమోదించిన సిఆర్‌డిఎ చట్టం ప్రకారం రాజధాని నిర్మాణానికి భూములు ఇచ్చిన రైతులకు మూడేళ్లలోగా అభివృద్ధి చేసిన ప్లాట్లు ఇవ్వాలని నిర్ణయించింది. కానీ, గత ప్రభుత్వం మూడేళ్లలో అభివృద్ధి చేసిన ప్లాట్‌లను ఇవ్వలేక పోయింది. సుమారు 54 వేల ప్లాట్లను 2018లో కాగితాలపైనే అప్పగించి చేతులు దులుపుకుంది. 2019లో రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. 2019 డిసెంబరు 17న మూడు రాజధానుల ప్రతిపాదనతో అసెంబ్లీలో బిల్లు ఆమోదించింది. అభివృద్ధి చేసిన ప్లాట్లు అప్పగించాలని రైతులు చేస్తోన్న పోరాటం ఇంకా కొలిక్కి రాలేదు. ఈ నేపథ్యంలో రాజధాని గ్రామాల్లో భూములు ఇచ్చిన వారిలో వాస్తవ రైతులు ఎంత మంది ఉన్నారు? 2014కు ముందు భూములు ఎవరి చేతుల్లో ఉన్నాయి? ఇప్పుడు ఎవరి చేతుల్లో ఉన్నాయి? అభివృద్ధి చేసిన ప్లాట్లు ఎవరికి ఇవ్వాలి? వీరిలో ఎంతమంది వాస్తవ రైతులు? రైతుల నుంచి భూములు కొనుగోలు చేసిన వారు ఎంతమంది? వారిలో ఇతర ప్రాంతాల వారు ఎందరు? రియల్ ఎస్టేట్ ప్రాతిపదికన కొనుగోలు చేసిన వారు ఎందరు? అనే వివరాల సేకరణలో సిఆర్‌డిఎ అధికారులు ఇప్పటికే ఉన్నారు. భూ సమీకరణ ప్రారంభమైన తరువాత రైతుల నుంచి భూములు కొనుగోలు చేసిన వారిని పెట్టుబడి దారుడుగా పరిగణించి వారికి అభివృద్ధి చేసిన ప్లాట్లు కాకుండా సాధారణ ప్లాట్లను మాత్రమే ఇచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిసింది. రాజధానిలో ఒక్కో ఎకరం అభివృద్ధికి రూ.2 కోట్లు అవసరం అవుతాయని, రైతులు ఇచ్చిన, ప్రభుత్వ భూములు కలిపి మొత్తం 50 వేల ఎకరాలకు లక్ష కోట్ల రూపాయలు అవసరం అవుతాయని ముఖ్య మంత్రి జగన్మోహన్‌రెడ్డి గత సోమవారం అసెంబ్లీలో స్వయంగా వెల్లడించిన విషయం విదితమే.

'పోలవరం' పనుల్లో నిబంధనలు పాటించాలి

కేంద్ర గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి అనిల్‌కుమార్ ఝా

ప్రజాశక్తి - పోలవరం/బుట్టాయగూడెం (పశ్చిమగోదావరి)

పోలవరం ప్రాజెక్టు, పునరావాసాల నిర్మాణాలు.. నాణ్యత, ఆర్థిక అంశాలకు లోబడి నిర్మించాలని కేంద్ర గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి అనీల్ కుమార్ ఝా సూచించారు. బుధవారం పోలవరం ప్రాజెక్టు అథారిటీ సిఇ ఎకె.ప్రధాన్, ఆర్‌అండ్‌ఆర్ కమిషనర్ చెరుకూరి శ్రీధర్, జిల్లా కలెక్టర్ కార్తికేయ మిశ్రా, రెవెన్యూ, ఇరిగేషన్, ఐటిడిఎ తదితర శాఖల అధికారులతో కలిసి పోలవరం ప్రాజెక్టు కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టును సెంట్రల్ వాటర్ కమిషన్ నిర్దేశించిన జలశక్తి మిషన్ మార్గదర్శకాల ప్రకారం పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాల్సి ఉందన్నారు. క్రమం తప్పకుండా పనుల పురోగతి, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ పురోగతిపై నివేదికలు సమర్పించాలని పేర్కొన్నారు. ఖరీఫ్ 2022 నాటికి పోలవరం ప్రాజెక్టు ద్వారా సాగునీరు అందించాలని సిఎం జగన్ లక్ష్యంగా పెట్టుకున్నారని, ఆ దిశగా పనులు ముమ్మరంగా సాగుతున్నాయని అధికారులు ఆయనకు వివరించారు. అనంతరం బుట్టాయగూడెం మండలంలోని రెడ్డి గణపవరం సమీపంలోని పల్లపూరు పునరావాస కేంద్రాన్ని అనిల్‌కుమార్ ఝా పరిశీలించారు. తొలుత పాఠశాల భవనాన్ని పరిశీలించి, జిసిసి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని సిపిఎం, సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ, ఆదివాసీ సంఘాలు ఆయనకు వినతిపత్రాలు అందించాయి.

నిర్వాసితుల గోడు పట్టించుకోని అధికారులు

తమ సమస్యలు చెప్పుకునేందుకు పలు గ్రామాల నుంచి వచ్చిన నిర్వాసితులకు నిరాశే మిగిలింది. అధికారులు వెళ్లిపోవడంతో సిపిఎం, సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీలు నిర్వాసితులతో కలిసి నిరసన తెలిపారు.

'ఎయిడెడ్'పై నిరంకుశ వైఖరి

మొదటి పేజీ తరువాయి

ఎయిడెడ్ పోస్టుల భర్తీ నిషేధం విధిస్తూ ఇచ్చిన జీఓలు రికార్డుగా ఉన్నాయని తెలిపారు. ఇద్దరు కలిసి 20ఏళ్లల్లో ఎయిడెడ్ విద్యాసంస్థలకు ఈ పరిస్థితి తీసుకొచ్చారని చెప్పారు. వి బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఎయిడెడ్ విద్యాసంస్థల్లో పోస్టులను 20 ఏళ్లుగా భర్తీ చేయకుండా వాటిని చంపేశారని తెలిపారు. 20ఏళ్ల అధికారంలో ఏవరూ ఉన్నారని ప్రశ్నించారు. ఎయిడెడ్ విద్యాసంస్థల పోస్టులు భర్తీచేయకుండా ఇచ్చిన జీఓలు సభ ముందు పెడితే ఏ ప్రభుత్వాలు ఇచ్చాయో తెలుస్తుందన్నారు. గత ప్రభుత్వాలు భర్తీ చేయకపోతే ఈ ప్రభుత్వం ఎందుకు భర్తీ చేయలేదని ప్రశ్నించారు.

బలోపేతం చేసేందుకే : మంత్రి కన్నబాబు

విద్య వ్యవస్థను బలోపేతం చేసే క్రమంలోనే రాష్ట్రప్రభుత్వం ఎయిడెడ్ సంస్థల్లో కూడా సంస్కరణలు చేపడు తోందని మంత్రి కన్నబాబు చెప్పారు. దానిలో భాగంగానే భాగంగానే బిల్లును తీసుకొచ్చామని అన్నారు. స్వాతంత్రం ముందు ప్రభుత్వ విద్యకు ఖర్చు చేయలేక గ్రాంటు ఇచ్చిందన్నారు. రాష్ట్రప్రభుత్వం ఇపుడు నాడు-నేడు కిందపాఠశాలలను బలోపేతం చేస్తుందన్నారు.

రాయలసీమకు సాయం అందించండి

ఎంపి శ్రీకృష్ణదేవరాయలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాయలసీమ ప్రాంతంలో సహాయ చర్యలకు తక్షణ సాయంగా రూ.1000 కోట్లు అందించాలని నరసరావుపేట ఎంపి శ్రీకృష్ణ దేవరాయలు కోరారు. ఈ మేరకు బుధవారం ప్రధాని మోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాలకు ఆయన వేర్వేరుగా లేఖలు రాశారు. వర్షాలతో ఈ ప్రాంతంలోని నాలుగు జిల్లాలు అతలాకుతలం అయ్యాయని తెలిపారు. నష్టాన్ని అంచనా వేయడానికి వెంటనే కేంద్ర బృందాన్ని ప్రకటించాలని కోరారు. సంక్షోభ సమయంలో ప్రాధాన్యతా ప్రాతిపదికన వరి సేకరణ కోసం కేంద్ర ప్రభుత్వం నుండి రాష్ట్రానికి రావాల్సిన నిధులను కూడా వెంటనే విడుదల చేయాలని కోరారు.

ఇక నిబంధనలకు లోబడే సినిమా టిక్కెట్ల రేట్లు

- ఫిలిండెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా ఆన్‌లైన్ టిక్కెటింగ్ విధానం
- సినిమాస్ (రెగ్యులేషన్) బిల్లుపై మంత్రి పేర్ని నాని

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రభుత్వ నిబంధనలకు లోబడే ఇక నుండి సినిమా టిక్కెట్ ధరలు ఉంటాయని రాష్ట్ర రవాణా, సమాచార శాఖ మంత్రి పేర్ని నాని అన్నారు. ఆంధ్రప్రదేశ్ సినిమాస్ (రెగ్యులేషన్) అమెండ్‌మెంటు బిల్లు-2021ని శాసనసభలో బుధవారం మంత్రి ప్రవేశపెట్టారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫిలిండెవలప్‌మెంట్ కార్పొరేషన్ అనే ప్రభుత్వ సంస్థ ద్వారా ఆన్‌లైన్ టిక్కెటింగ్ విధానాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. థియేటర్లలో రోజుకు నాలుగు షోలు మాత్రమే వేయాలని చట్టం చెబుతున్నా అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారన్నారు. ప్రభుత్వ నియమనిబంధనలకు లోబడ్డే సినిమా పరిశ్రమ నడుచుకోవాలే తప్ప ఇష్టారాజ్యంగా నడుచే అవకాశం ఇకపై ఉండదన్నారు. ఆన్‌లైన్ ద్వారా సినిమా టిక్కెట్లు థియేటర్లలో బుక్ చేసుకునే అవకాశం ఉందన్నారు. సినిమా టిక్కెట్లరేట్లు ప్రజలకు అందుబాటులోకి తెచ్చి ప్రేక్షకుల బలహీనతను సొమ్ము చేసుకునే అవకాశం ఇవ్వకుండా కట్టడి చేయడానికి ప్రభుత్వం ఆన్‌లైన్ విధానం ఉపయోగపడుతుందన్నారు. చాలా చోట సినిమా కలెక్షన్లు, నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లు చెప్పిన మొత్తాలకు రాష్ట్ర ప్రభుత్వానికి వచ్చే జిఎస్‌టి పోల్చి చూసినా ఎక్కడా పొంతన కనబడటం లేదన్నారు. ఆన్‌లైన్ సిస్టమ్ పెడితే ప్రభుత్వానికి వచ్చే పన్నులు పోర్టల్‌లో తెలుస్తాయని, ప్రజలకు కూడా టిక్కెట్ కూడా సరసమైన రేటుకే లభ్యమవుతాయన్నారు. ఇనిమా థియేటర్ల యజమానులు, డిస్ట్రిబ్యూటర్లో విమర్శలు చేస్తున్నారంటే అర్థముంటుందని,. ఓ రాజకీయపార్టీ లోపాయికారిగా ప్రభుత్వంపైన , ఆన్‌లైన్ టిక్కెట్ విధానంపై బురద వేయటం చూస్తుంటే ఎంత దుర్మార్గంగా రాజకీయాలు నడుస్తున్నాయో అర్థం చేసుకోవచ్చన్నారు.

మరో 3070 కోట్ల ట్రూఅప్ భారం

- 'సోలార్'ప్రాజెక్టుపై విచారణ జరపాలి
- ఇఆర్‌సి విచారణలో సిపిఎం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యుత్ వినియోగదారులపై 3,699 కోట్ల రూపాయల భారాన్ని మోపిన రాష్ట్ర ప్రభుత్వం తాజాగా మరో 3,070 కోట్ల రూపాయల ట్రూఅప్ భారాన్ని మోపేందుకు రంగం సిద్ధం చేసిందని సిపిఎం రాష్ట్రకార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు వెల్లడించారు .ఎపి విద్యుత్ నియంత్రణ మండలి(ఎపిఇఆర్‌సి) చైర్మన్ సివి నాగార్జున రెడ